సాక్షి సంగారెడ్డి

సోమవారం | 22 | జూలై | 2024

అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాలపైనే అందరి దృష్టి.. ఎమ్మెల్యేలు వినిపించే గళంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చి నిధులు రాబడతారని ఆశలు చిగురిస్తున్నాయి. సమస్యల పరిష్కారంపై ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేల అభిప్రాయాలు..



8లో..



నేడు బొల్లారం మున్సిపల్ కమిషనర్‌తో సాక్షి ఫోన్‌ఇన్

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యల గురించి తెలియజేసేందుకు సోమవారం 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, పట్టణ సమస్యల గురించి మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌ద్వారా తెలియజేయవచ్చు.



అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పట్టణ సమస్యలు
మున్సిపాలిటీ : బొల్లారం
కమిషనర్ : మంగతాయారు
తేదీ: 22.07.2024 (సోమవారం)
సమయం: ఉదయం 11 నుంచి 12గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
9949689529/ 9966540811

బోనం.. వైభోగం



సదాశివపేట(సంగారెడ్డి) : సదాశివపేట పట్టణంలో మహంకాళి మాత బోనాల ఊరేగింపు

ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా బోనాల పండగను వైభవంగా నిర్వహించారు. దీంతో పల్లెలన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మహిళలు బోనం చేసి ర్యాలీగా ఆలయాలకు తరలివెళ్లారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల ఊరేగింపులో డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు అలరించాయి.



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్‌లో బోనాల ఊరేగింపు

గురుదేవోభవ..



ఝరాసంగం(జహీరాబాద్): బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమం వద్ద పీఠాధిపతుల ఊరేగింపు

గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెలవారుజాము నుంచే దేవాలయాల వద్ద బారులుదీరారు. బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చనలు, సాయి కీర్తనలతో ఆలయాలన్నీ మార్మోగాయి. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం చేపట్టారు.



పటాన్‌చెరు : అమీన్‌పూర్ సాయిబాబా ఆలయంలో భక్తుల పూజలు

కొండంత దోపిడీ!



- వెలుగులోకి మరికొందరి మైనింగ్ అక్రమ దందాలు
- రూ.83 కోట్లు సీనరేజీని ఎగవేసిన ఎనిమిది కంపెనీలు
- ఫెనాల్టీతో కలిపి రూ.575 కోట్లు చెల్లించాలని నోటీసులిచ్చిన భూగర్భగనులశాఖ
- గూడెం మధు మైనింగ్ వ్యవహారం మరువక ముందే వెలుగులోకి మరికొన్ని బాగోతాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి మైనింగ్ దోపిడీ వ్యవహారం సద్దుమణగక ముందే జిల్లాలో మరికొందరి మైనింగ్ దందాలు వెలుగులోకి వచ్చాయి. ఎమినిది మైనింగ్ కంపెనీలు జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా ఖనిజ సంపదను లూటీ చేసినట్లు భూగర్భ గనుల శాఖ అధికారులు తేల్చారు. తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి విచ్చలవిడిగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడినట్లు తేలింది. ఈ ఎనిమిది కంపెనీలు ఏకంగా రూ.83.67 కోట్ల సీనరేజీని భూగర్భ గనులశాఖకు ఎగవేసినట్లు గుర్తించారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడి మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడినందుకు గాను ఫెనాల్టీతో రూ.575.13 కోట్లు చెల్లించాలని భూగర్భ గనులశాఖ నోటీసులు జారీ చేసింది.

సరిహద్దులు దాటి తవ్వకాలు

జిల్లాలో మొత్తం 133 మైనింగ్ లీజులు ఉన్నాయి. ఇందులో 88 క్వారీల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. ఇందులో ఎనిమిది క్వారీల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగినట్లు భూగర్భ గనులశాఖ గుర్తించింది. ఈ క్వారీలో అనుమతికి మించి ఖనిజాన్ని లూటి చేసినట్లు తేలింది. కొన్ని క్వారీలు అనుమతించిన దానికి మించి ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరిగినట్లు గుర్తించారు. మరోవైపు ఈ అక్రమార్కులు అనుమతి తీసుకున్న పరిమాణానికి మించి తవ్వకాలు చేసినట్లు తేలింది.

ఈటీఎస్ సర్వేతో వెలుగులోకి అక్రమాలు

తొమ్మిదేళ్ల కాలంలో జిల్లాలో మైనింగ్ మాఫియా రెచ్చిపోయింది. అడ్డూఅదుపు లేకుండా దోపిడీకి పాల్పడింది. రాజకీయ అండదండలు, పలుకుబడి ఉండటంతో అడిగేనాథుడే లేకపోవడంతో సహజ సిద్ధమైన ఖనిజ సంపదను లూటీచేసి రూ.వేల కోట్లు దండుకున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే జిల్లాలోని మైనింగ్ అక్రమాలపై విచారణ చేపట్టారు. ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి క్వారీల్లో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన డీజీపీఎస్ సర్వే చేసి ఈ అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని వెలుగులోకి తెచ్చారు. ఈ క్రమంలో గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడు మధుసూదన్‌రెడ్డి క్వారీలో అక్రమ మైనింగ్ వ్యవహారం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఆయనపై క్రిమినల్ కేసులు నమోదై జైలుకు వెళ్లడం, ఆ తర్వాత బెయిల్‌పై బయటకు రావడం జరిగిపోయింది. ఈ క్రమంలోనే అధికారులు చేపట్టిన విచారణలో మరికొందరి మైనింగ్ దోపిడీ బాగోతాలు వెలుగులోకి వచ్చాయి.

అక్రమ తవ్వకాలపై నోటీసులిచ్చాం

జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడిన మరో ఎనిమిది మైనింగ్ లీజుదారులకు డిమాండ్ నోటీసులు ఇచ్చాం. ఈ క్వారీల్లో సీనరేజీ ఎగవేత, అనుమతికి మించి ఖనిజం రవాణా, సరిహద్దులు దాటి తవ్వకాలు జరిగినట్లు తేలింది. ఎగవేసిన సీనరేజీ, ఫెనాల్టీతో కలిపి రూ.575 కోట్లు చెల్లించాలని డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్నాం. దీనిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం.

– రవిబాబు, అసిస్టెంట్ డైరెక్టర్, భూగర్భగనులశాఖ

వీరంతా నేతల బినామీలు

రూ.575 కోట్లు ఫెనాల్టీ చెల్లించాలని భూగర్భ గనుల శాఖ తాజాగా డిమాండ్ నోటీసులు ఇచ్చిన ఈ ఎనిమిది మైనింగ్ కంపెనీలు రాజకీయ నేతల బినామీలవి కావడం గమనార్హం. ఇందులో పటాన్‌చెరుకు చెందిన ఓ బీజేపీ నేతకు చెందిన బినామీ కంపెనీ కూడా ఉన్నట్లు సమాచారం. వీరంత పటాన్‌చెరు మండలం లక్డారం, జిన్నారం మండలం ఖాజీపల్లి, మాధారం గ్రామాల పరిధిలోని క్వారీల్లో ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగినట్లు గుర్తించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి టౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన పార్టీ జిల్లాస్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేయాలన్నారు. నేటికీ గృహజ్యోతి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. పంట పెట్టుబడి సాయం, బీమా పథకాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధరణి సమస్యలను పరిష్కరించాలని, ఇతర పంటలకూ బోనస్ ఇవ్వాలని కోరారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలివ్వాలన్నారు. కార్మికుల కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకను గుణంగా సవరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య, మల్లేశం, అతిమేల మానిక్, రామచందర్, సాయిలు, నాయకులు నర్సింలు, యాదగిరి, ప్రవీణ్, మహిపాల్ పాల్గొన్నారు.

బదిలీ అయిన వారిని రిలీవ్ చేయాలి

మెదక్‌జోన్: బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే ఇవ్వాలన్నారు. బదిలీ అయిన ఎస్జీటీలను సత్వరమే రిలీవ్ చేసి వారి స్థానంలో తాత్కాలిక ఉపాధ్యాయులు, విద్యా వలంటీర్లను నియమించాలన్నారు. పీఆర్సీ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు మాట్లాడుతూ.. 317 జీఓ బాధిత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. బడ్జెట్‌లో ప్రభుత్వ విద్యకు ఎక్కువ నిధులు కేటాయించి బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫలంబరిగా వనదుర్గమ్మ



పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ ఆదివారం ఫలాంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికీ భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాలు తీసి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు.

న్యూస్‌రీల్

రహదారుల మంజూరుకు విన్నపం



కోమటిరెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ ఆదివారం హైదరాబాదులో రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, కామారెడ్డి జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైనచోట్ల రోడ్లు, ప్రభుత్వ భవనాలను మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



పోలీస్ అవుట్ పోస్టు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. నాగల్‌గిద్ద మండలం మోర్గి చౌరస్తాలో పోలీస్ అవుట్ పోస్టు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ నాగల్‌గిద్ద మండల కేంద్రంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా త్వరలో నిర్మాణం చేపడతామని చెప్పారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఐలు, డిప్యూటీ ఈఈ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు మాణిక్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, గుండేరావు పటేల్, వినోద్ పటేల్, అంబాజీ, సంతోష్, మనోహర్ పాల్గొన్నారు.

సింగూరుకు వరద



సింగూరు డ్యాంలో చేరిన నీరు

పుల్‌కల్(అందోల్) : నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వానకు సింగూర్ ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు చేరింది. ఆదివారం ప్రాజెక్టులోకి 738 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరిందని ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. డ్యాంలో 29.917 టీఎంసీల నీటి సామర్థ్యానికిగాను ప్రస్తుతం 13.626 టీఎంసీల నిల్వ ఉందని అధికారులు చెప్పారు. డ్యాం నుంచి మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, హైదరాబాద్ తాగునీటి సరఫరాకు 80 క్యూసెక్కులు, తాలెల్మ నీటి పథకానికి 41 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

విస్తారంగా వర్షాలు



సిద్దిపేట పట్టణంలో కురుస్తున్న వర్షంలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురుస్తునే ఉంది. కోహెడలో అత్యధికంగా 50.8మి.మీ.వర్షపాతం నమోదైంది. బెజ్జంకిలో 48.8మి.మీ., కోహెడ మండలం శనిగరంలో 48.3మి.మీ., సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో 43మి.మీ., అక్కన్నపేట మండలం గండిపల్లిలో 41.5మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే కోహెడ మండలం సముద్రాలలో 41.5మి.మీ., చిన్నకోడూరు మండలం పెద్దకోడూరులో 39.8మి.మీ, అక్కన్నపేట మండలం కట్కూర్ 36.8మి.మీ, ధూళ్మిట్ట మండల కేంద్రంలో 33.3మి.మీ, తొగుట మండలం రాంపూర్‌లో 32.5మి.మి, మద్దూరు మండలం రేబర్తిలో 31.8మి.మీ. వర్షపాతం నమోదైంది. దుబ్బాక మండలం హబ్షిపూర్‌లో 31.3మి.మీ., సిద్దిపేట పట్టణంలో 31మి.మీ., తొగుట మండలం తుక్కాపూర్‌లో 30.3మి.మీ., కొండపాక మండల కేంద్రంలో 30.3మి.మీ., హుస్నాబాద్‌లో 30.3మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా సగటున 43.57మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వర్షం విరామంలేకుండా కురుస్తుండటంతో వివిధ పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

'జాడి మల్కాపూర్' పరవళ్లు



పరవళ్లు తొక్కుతున్న జాడిమల్కాపూర్ ఎత్తిపోతల

తెలంగాణ–కర్నాటక రాష్ట్రాల సరిహద్దు మొగుడంపల్లి మండల జాడిమల్కాపూర్ గ్రామానికి సమీపంలోని ఎత్తిపోతల జల కళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎత్తిపోతలకు భారీ వరదనీరు చేరి పరవళ్లు తొక్కుతుంది. చిన్న కొండల మధ్య నుంచి పెద్దలోయలోకి నీరు జారి పడటం ఇక్కడ ప్రత్యేకత. జహీరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు సమీప గ్రామాలు, గిరిజన తండాల ప్రజలు ఎత్తిపోతలను చూసేందుకు తరలివస్తున్నారు.

జహీరాబాద్ టౌన్:

ఫ్లైఓవర్ తిప్పల్



బ్రిడ్జి వద్ద అసంపూర్తిగా మట్టి పనులు

- నత్తనడకన బ్రిడ్జి నిర్మాణం
- ఐదేళ్లు కావొస్తున్నా పూర్తికాని పనులు
- రైల్వే గేటు వద్ద జనం అష్టకష్టాలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణ సమీపంలోని రైల్వే గేటు వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతోంది. పనులు ప్రారంభమై ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక గేటు వద్ద ప్రజలకు అష్టకష్టాలు పడుతున్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జహీరాబాద్ మీదుగా 65వ జాతీయ రహదారి వెళ్తుంది. పొరుగున ఉన్న కర్నాటక, మహారాష్ట్రలతో పాటు జహీరాబాద్ పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ఈ రోడ్డు గుండా పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే దారిలో రైల్వే గేటు ఉంది. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేయడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రైలు వెళ్లేంత వరకు ఇరువైపులా వేచిచూడాల్సి వస్తుంది. ఈ రోడ్డుపై వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో రైల్వే గేటు పడిన ప్రతీసారి ఫుల్ ట్రాఫిక్ జాం అవుతోంది. గూడ్స్ రైలు వచ్చినప్పుడైతే సుమారు 30 నిమిషాలకు పైగా గేటు మూసి ఉంటుంది. ఆ సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డు ఇరుకుగా ఉండి గుంతలమయంగా ఉండటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

రూ.90 కోట్లతో బ్రిడ్జి పనులు ప్రారంభం

ట్రాఫిక్ నియంత్రణ కోసం రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని అప్పట్లో ప్రజలు డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మాణిక్‌రావు పలుమార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరి చేయించారు. రూ.90 కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. శరవేగంగా సాగిన పనులు లాక్‌డౌన్ సమయంలో నిలిచిపోయాయి. ఏడాది తరువాత తిరిగి పనులు ప్రారంభంకాగా, అప్పటి నుంచి నత్తనడక సాగుతున్నాయి. గతేడాది మే నెలలో పూర్తి చేస్తామని సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పేర్కొన్నా.. ఇప్పటివరకు కొనసాగుతూనే ఉన్నాయి. నెమ్మదిగా పనులు జరుగుతుండటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రోడ్డు మధ్యలో వాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు కూడా పూర్తికాలేదు. రైల్వే గేటు నుంచి బీదర్ చౌరస్తా వరకు ఫోర్‌లేన్ సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు. రోడ్డు మధ్యలో డివైండర్ పనులు చేపట్టాల్సి ఉంది. రైల్వే బ్రిడ్జి పనుల కారణంగా ఐదేళ్లుగా అవస్థలు పడుతున్నామని, త్వరతగతిన పనులు పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



జహీరాబాద్ రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి

త్వరలోనే పూర్తిచేస్తాం

రైల్వే గేటు వద్ద చేపడుతున్న బ్రిడ్జి పనులు చివరిదశలో ఉన్నాయి. దాదాపు పనులన్నీ దగ్గరపడ్డాయి. స్లాబ్ వర్క్ పూర్తి కాగా మట్టి పనులు జరుగుతున్నాయి. సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. డివైడర్ పనులు మాత్రమే మిగిలాయి. వివిధ కారణాల వల్ల పనుల్లో కొంత జాప్యం జరిగింది. ఒకటి రెండు నెలల్లో పూర్తిచేసి బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకొస్తాం.

– నర్సింలు, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

క్లుప్తంగా

భూ వివాదంలో కానిస్టేబుల్‌పై దాడి


ఆస్పత్రిలో రవీందర్

హుస్నాబాద్‌రూరల్: భూ వివాదంలో కానిస్టేబుల్‌పై దాడి జరిగిన ఘటన హుస్నాబాద్ మండలం రాములపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామంలోని ఓ దారి విషయంలో ఇరువర్గాలకు పలుమార్లు గొడవలు జరిగాయి. ఇందులోని ఓ వర్గంలో గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాయిని రవీందర్ కూడా ఉన్నాడు. ఇతడు కరీంనగర్ పోలీసు హెడ్ క్వాటర్స్‌లో విధులు నిర్వహిస్తాడు. ఆదివారం సెలవు కావడంతో వ్యవసాయ పనులు చూసుకునేందుకు స్వగ్రామం రాములపల్లి వచ్చాడు. పొలం వద్దకు ట్రాక్టర్ తీసుకెళ్తున్న క్రమంలో సమీప రైతులు గొడవకు వచ్చి ఆవేశంతో గొడ్డలితో దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు రవీందర్‌ను హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి తరలించి ప్రథమ చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల విధులకు ఆటంకం

- వ్యక్తిపై కేసు నమోదు

కొమురవెల్లి(సిద్దిపేట): పోలీసులు విధుల్లో ఉన్నప్పుడు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన కొమురవెల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి కొమురవెల్లి శివారులో వాహనాల తనిఖీ చేస్తున్నారు. ఐనాపూర్ గ్రామానికి ఏర్పుల యాదగిరి పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినందుకు అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ. 37,500, సెల్‌ఫోన్లు, కార్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు

కొండపాక(గజ్వేల్): పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన ఎస్‌డీ షాహిన్, ఎస్‌డీ అంబెడ్, యెల్లు నారాయణరెడ్డి, లగిశెట్టి రవీందర్, దాసరి బాబు, ముష్ఠం నాగరాజు ఆదివారం పేకాట ఆడుతున్నారని సమాచారం అందింది. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్‌తోపాటు మరికొందరు పోలీసులతో వెళ్లారు. ఓ రాజకీయ పార్టీ నాయకుడి ఆరుగురు పేకాట ఆడుతుండగా పట్టుకొని రూ.37,500 నగదు, 6 సెల్ ఫోన్లు, 2 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు. చట్ట వ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు, పేకాట ఆడుతున్నట్లు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

ఫ్లెక్సీల చించివేత


చిరిగిపోయిన ఫ్లెక్సీ

చేర్యాల(సిద్దిపేట): టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ల రాజిరెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని చేర్యాల పట్టణ కేంద్రంలో పీఎంఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. బర్త్‌డే వేడుకలకు ముందు రోజు పట్టణ కేంద్రంలోని చుంచనకోట రోడ్డు, మార్కెట్ యార్డు, ఫంక్షన్ హాల్ తదితర ప్రాంతాల్లో రాజిరెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలు పెట్టారు. తెల్లవారేసరికి ఫ్లెక్సీలు చించి వేసి ఉండడంతో ఆయన వర్గానికి సంబంధించిన యువసేన, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కొమురవెల్లి మల్లన్న కల్యాణం సందర్భంగా మండల కేంద్రంలో రాజిరెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, నేడు బర్త్‌డే శుభాకాంక్షల ఫ్లెక్సీలు చించి వేయడం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుటకు ఇంటిపని,వంటపనికి వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీవసతి + భోజనం. జీ: 20 K. ఫోన్: 8977639662, 8977639663 [H-796259]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గౌరవెల్లి, గండిపెల్లి పూర్తి చేయాలి


పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: హుస్నాబాద్‌కు మొదటి సారిగా మంత్రి పదవి దక్కడంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురురిస్తున్నాయి. అసెంబ్లీ సమావేశాల్లో ప్రాజెక్టులు, మెడికల్ కళాశాల, నియోజకవర్గ సమస్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రస్తావించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. ప్రధానంగా సాగుకు అవసరమైన నీళ్ల కోసం గౌరవెల్లి, గండిపెల్లి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం దాదాపు 95 శాతం పూర్తయింది. ట్రయల్ రన్ కూడా చేశారు. మిగిలింది కాల్వల నిర్మాణం. అవసరమయ్యే 1,200 ఎకరాల భూ సేకరణ చేశారు. నిధులు విడుదల కావాల్సి ఉంది. నిధులు లేక గండిపెల్లి ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసినట్లయితే దాదాపు 1.60లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే మెడికల్ కళాశాల, గిరిజనుల అభివృద్ధి కోసం, ఉపాధి నైపుణ్యం పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది. నియోజకవర్గంలోని ఏడు మండలాలకు డిగ్రీ కళాశాల ఉంది. ఉన్నత చదువుల కోసం జిల్లా కేంద్రాలకు, నగరాలకు వెళ్తున్నారు. ఉన్నత విద్య కోసం పీజీ, ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయడంపై దృష్టి సారిస్తాం..

అభివృద్ధి పనులకు రూ.900 కోట్లు ఇవ్వాలి


కేసీఆర్

గజ్వేల్ : మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం కావడంతో పలు సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని ప్రజలు కేసీఆర్‌ను కోరుతున్నారు. ప్రత్యేకించి నియోజకవర్గంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ రింగు రోడ్డు పెండింగ్, బస్టాండ్ల నిర్మాణం, మాతా శిశు సంరక్షణ ఆస్పత్రికి అదనపు వసతల కల్పన, గత ప్రభుత్వం ప్రతిపాదించిన గజ్వేల్‌లో ఏసీపీ కార్యాలయం, రూరల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం, స్పోర్ట్స్ విలేజ్, నియోజకవర్గంలోని గజ్వేల్–ప్రజ్ఞాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.900 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. కానీ ఈ పనులకు ఆమోదం లభించలేదు. అదే విధంగా మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలు ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తుంది. ములుగు మండలం తున్కిబొల్లారంలోని కొండపోచమ్మసాగర్ నిర్వాసితుల కాలనీలో ఎన్నో సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిపై ప్రస్తావిస్తే కొంత మేరకైనా పరిష్కారం లభిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు.

అధ్యక్షా..

- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- గళం వినిపించనున్న ఎమ్మెల్యేలు



కొత్త ప్రభుత్వ హయాంలో రెండోసారి అసెంబ్లీ సమావేశాలు రేపటి నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ సమావేశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లోని సమస్యలు, అభివృద్ధి పనులకు కావాల్సిన నిధులకు సంబంధించి ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకురానున్నారు. ఇందుకుగాను ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. ప్రజలు కూడా తమ ఎమ్మెల్యే ఎలాంటి సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావిస్తారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



పరిహారం కోసం ఒత్తిడి తేవాలి


సునీతారెడ్డి

నర్సాపూర్ : భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అడిగి రైతులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని అడిగే అవకాశం ఉంది. తమ భూములకు భూమి ఇవ్వాలని, లేని పక్షంలో ఎకరానికి రూ.60 నుంచి రూ.70 లక్షల పరిహారం ఇవ్వాలని రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నందున రైతుల సమస్యకు ఆమె ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఆయా ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములకు రిజిస్ట్రేషన్ విలువకు మూడింతలు నష్టపరిహారంగా చెల్లించడంతో బయటి మార్కెట్‌లో భూముల ధరలు చాలా ఎక్కువగా ఉన్నందున రైతులు నష్టపోతున్నారు. అలాగే ప్రధానంగా ట్రిపుల్‌ఆర్ రోడ్డుకు, సంగారెడ్డి రీచ్–2 కాలువకు భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుతం మార్కెట్ విలువకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడిగే అవకాశం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ఉస్మానియా యూనివర్సిటీ పీజీ కాలేజీకి సొంత భవనం లేదు. ఎస్‌డీఎఫ్ నిధులను ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడంతో నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు భవనాల నిర్మాణపనులు నిలిచిపోవడంతో నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేయాలని అడగవచ్చు.

మెడికల్ కళాశాల కావాలి


రోహిత్‌రావు

మెదక్‌జోన్ : మెదక్‌కు ఇచ్చిన హామీలతో పాటు అర్ధాంతరంగా ఆగిన అభివృద్ధి పనులు పూర్తికావాలంటే స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రావు అసెంబ్లీలో గళమెత్తి నిధులు తెస్తే తప్పా సమస్యలు పరిష్కారం కావని ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లాలో ఏకైక మధ్య తరహా ఘనాపూర్ ప్రాజెక్టు ఎత్తు పెంపు, మెడికల్ కళాశాల నిర్మాణం అవసరం ఉంది. అలాగే ఏడుపాయలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందు నిధులు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనేక మండలాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. జిల్లాలోని అనేక మండలాల్లో కాళేశ్వరం కాల్వలు, రీజినల్ రింగ్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పై అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యేలా ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఇస్నాపూర్ వరకు మెట్రో వేయాలి


మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో గ్రామాలు అత్యంత వేగంగా అనూహ్యంగా పట్టణ రూపు రేఖలు సంతరించుకున్నాయి. అందుకు తగినట్లుగా మౌలిక వసతుల ఏర్పాట్లు జరగలేదు. అసెంబ్లీలో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రస్తావించాల్సిన సమస్యలు ఇవి.. మెట్రో రైలు మార్గాన్ని ఇస్నాపూర్ వరకు పెంచాల్సిన అవసరం ఉంది. డబుల్ బెడ్ రూమ్ లు నిర్మాణం పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో పటాన్ చెరువుకు మంజూరైన రూ.457 కోట్లు తాజా ప్రభుత్వం రద్దు చేసింది. వాటి పునరుద్ధరణ అంశంపై ప్రస్తావించాలి. బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్‌లలో జనాభాకు సరిపడా తాగునీటి సరఫరా కోసం ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కొరతను తీర్చాలి. పాశమైలారం, బొల్లారం, కాజిపల్లి, గడ్డ పోతారం పారిశ్రామిక వార్డుల్లో కాలుష్య సమస్య పరిష్కారం కోరాలి.

నిమ్జ్ భూ సేకరణ వేగవంతంపై ప్రస్తావించాలి


మాణిక్ రావు

జహీరాబాద్ టౌన్: అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నందున జహీరాబాద్ ప్రధాన సమస్యలను ప్రస్తావించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావును ప్రజలు కోరుతున్నారు. జహీరాబాద్ నియోజవకర్గంలోని ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఏర్పాటు చేస్తున్న జాతీయ ఉత్పాదక మండలి(నిమ్జ్) కోసం చేపడుతున్న భూసేకరణ నత్తనడకన సాగుతుంది. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు కొన్ని కంపెనీలు శంకుస్థాపన చేసినా ఇంత వరకు పనులు ప్రారంభంకావడం లేదు. అలాగే రైతుల ఆలుగడ్డ, అల్లం పంటల నిల్వల కోసం కోల్డ్ స్టోరేజ్ ఉండాలి. జహీరాబాద్–బీదర్ రహదారిని ఫోర్‌లైన్ రోడ్డుకు నిధులు మంజూరి చేయించి పనులు ప్రారంభించాలి. జహీరాబాద్ పట్టణ సమీపంలో ఉన్న చక్కెర కర్మాగారంలో క్రిషింగ్ ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలి. నియోజకవర్గంలోని 26 పంచాయతీ రాజ్ రోడ్ల మరమ్మతులకు గత ప్రభుత్వం రూ. 51 కోట్ల నిధులను మంజూరి చేసింది. పలు కారణాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదు. ఈ రోడ్ల గురించి ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ డివిజన్ హామీపై పోరాడుతా..


కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక : దుబ్బాక నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు అలాగే ఉండిపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దుబ్బాక రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఏళ్ల నుంచి అలాగే కలగానే మిగిలిపోతుంది గత అసెంబ్లీ ఎన్నికల ముందు గెలిచిన వెంటనే డివిజన్ ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి సైతం దుబ్బాక సభలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. అలాగే తొగుట మండలంలో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి ప్రధాన కాల్వలు నిర్మించారే తప్పా చెరువులు, పంట పోలాలకు నీరందించే కాల్వలు చాల వరకు మధ్యలోనే నిర్మించకుండా అసంపూర్తిగా ఉన్నాయి. దుబ్బాక–హబ్షీపూర్ మధ్యన నాలుగు లైన్ల రోడ్డు , దుబ్బాక 100 పడకల ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, సిబ్బంది నియామకం చేయాలి. మంగళవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పై అభివృద్ధి పనులు సాధించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ప్రజలు కోరుతున్నారు.

ఫ్యాక్టరీల ఏర్పాటుపై దృష్టి


దామోదర

జోగిపేట(అందోల్): అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహ ప్రస్తావించాల్సిన అంశాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని 9 మండలాల్లోని ఆర్‌అండ్‌బీ రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించాలి. నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు లేక ఎన్నో రకాల ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి. ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం కొత్త మండలాలు ఏర్పాటు చేసినా మండల కార్యాలయాల భవనాలను మాత్రం నిర్మించలేదు. పై సమస్యలు పరిష్కారంపై అసెంబ్లీలో మాట్లాడుతా..

మోడల్ సిటీగా తయారు చేయాలి


చింతా ప్రభాకర్

సంగారెడ్డి : సంగారెడ్డి నియోజక వర్గంలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయాలి. మహబూబ్ సాగర్ చెరువు పునరుద్దీకరణకు సంబంధించిన నిధులు కేటాయించాలని అసెంబ్లీలో సంగారెడ్డి ఎమ్మెల్యే ప్రస్తావించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరుతున్నారు. సంగారెడ్డి, సదాశివపేట పట్టణాలకు ఇండోర్ స్టేడియంలు మంజూరు చేయాలని నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక. ఇస్నాపూర్ నుంచి సదాశివపేట వరకు మెట్రో రైలు పొడిగించాలని ప్రజలు కోరనున్నారు. ప్రధానంగా నియోజకవర్గంలో రోడ్లు, మురికి కాల్వలు బాగు చేయాలి. అలాగే పట్టణంలో ప్రధానమైనది డంపు యార్డు సమస్య తీర్చాలి. ఇలా పలు సమస్యలపై చింతా ప్రభాకర్ అసెంబ్లీలో మాట్లాడాలని ప్రజలు విన్నవిస్తున్నారు.

ఉపాధ్యాయుల భర్తీ ప్రస్తావిస్తా..


సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నియోజకవర్గంలో వలసల నివారణకు కర్మాగారాల ఏర్పాటుతోపాటు, వెనుకబడ్డ ఖేడ్‌లో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ మొదట చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ ఖాళీల వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, రూరల్‌లో భర్తీ అయ్యాకే అర్బన్‌కు అవకాశం ఇవ్వాలని కోరనున్నట్లు చెప్పారు. కర్మాగారాల ఏర్పాటుకు స్థలాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. సింగూరు నీరు నల్లవాగులోకి మళ్లింపు, నల్లవాగు ఫ్లడ్ ఫ్లో కెనాల్, పెద్దశంకరంపేటకు మినీ మార్కెట్ యార్డు, ఖేడ్‌కు ఒక 132కేవీ సబ్‌స్టేషన్, రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, జూనియర్ కళాశాలలు, గురుకులాలకు పక్కా భవనాలు నిర్మాణాల గురించి ప్రస్తావిస్తా.

యూనివర్సిటీ అవసరం..


హరీశ్ రావు

సిద్దిపేటజోన్ :నియోజకవర్గ ప్రజల పక్షాన రెండు ప్రధాన అంశాల్లో ప్రస్తావన అవసరమే. సిద్దిపేట నియోజకవర్గం గత ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా ప్రగతి పథంలో సాగింది. వైద్యం, విద్య రంగాల్లో గణనీయంగా అభివృద్ధి సాధించింది. విద్య విషయంలో ఒక్క యూనివర్సిటీ ఏర్పాటు మాత్రమే మిగిలింది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వంలో సిద్దిపేటకు యూనివర్సిటీ దక్కేలా అడుగులు వేయాలి. కాళేశ్వరం నీటిని రంగనాయక సాగర్ లోకి లిఫ్టింగ్ చేసే అంశంపై నిర్మాణంలో ఉన్న వెటర్నరీ కళాశాల అర్ధాంతరంగా ఆగిపోయింది. తిరిగి పనుల పున ప్రారంభం, జిల్లాలో మంజూరై రద్దు అయిన అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణానికి తిరిగి టెండర్ల ప్రక్రియకు పరిష్కారం లభించాలి.

హైవేపై కార్ల బీభత్సం..

- ఒకదానికొకటి మూడు కార్లు ఢీ
- కౌడిపల్లి మండలంలో ఘటన



బ్రిడ్జిపైన ఢీకొన్న మూడు కార్లు

కౌడిపల్లి(నర్సాపూర్): హైవేపై కార్లు బీభత్సం సృష్టించాయి. మూడు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారితోపాటు గుర్రానికి, కాపలాదారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన 765డీ జాతీయ రహదారిపై మండల కేంద్రమైన కౌడిపల్లి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఓబ్లాపూర్ గ్రామానికి చెందిన గొర్రెల పెంపకందారులు మల్లేశం గొర్రెలను తీసుకెళ్తున్నాడు. కౌడిపల్లి బ్రిడ్జ్ పైన గొర్రెల కాపలాదారుల సామగ్రిని మోసే గుర్రం ముందు వెళ్తుండగా దాని వెనకాల బైక్‌పై మల్లేశం వెళ్తున్నాడు. హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వస్తున్న కారు గుర్రంను ఢీకొట్టడంతో ఎగిరి వెనుక వస్తున్న కాపలాదారుడు మల్లేశంపై పడింది. అతడికి, గుర్రానికి కాలు విరిగి గాయాలు అయ్యాయి. గుర్రంను ఢీకొన్న కారు అదే వేగంతో ఎదురుగా మెదక్ వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారును ఢీకొట్టింది. దాని వెనుకాల వస్తున్న కారు ముందు కారును ఢీకొట్టింది. దీంతో రహదారిపై బ్రిడ్జ్‌వద్ద మూడు కార్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కార్లలో ఉన్న ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

కారు ఢీకొని వృద్ధుడు..

చిన్నకోడూరు(సిద్దిపేట): కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కమ్మర్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగ రాజయ్య(65) శనివారం రాత్రి ఇంటి నుంచి నడుచుకుంటూ గ్రామంలోకి వెళ్తున్నాడు. బెజ్జంకి మండలం గుండారం గ్రామానికి చెందిన కారు సిద్దిపేట నుంచి గుండారం వెళ్తుండగా రాజయ్యను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన ట్యాంకర్


రాజయ్య (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ట్యాంకర్ స్కూటీని ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కూకట్‌పల్లి వివేక్‌నగర్‌కు చెందిన కృష్ణ గౌడ్(27) అక్కడే టీవీఎస్ షోరూంలో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నాడు. 20వ తేదీ మధ్యాహ్నం స్నేహితుడు క్రాంతి కిరణ్ స్కూటీపై కృష్ణ గౌడ్ అమీన్‌పూర్‌కు వచ్చాడు. తిరిగి రాత్రి కూకట్‌పల్లికి వెళ్తుండగా ఎంపైర్ మీడోస్ వద్దకు రాగానే వెనుక నుంచి వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి శాంతమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..

అక్కన్నపేట(హుస్నాబాద్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం మసిరెడ్డితండా గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాలోతు దేవుల(52) రెండు రోజులుగా విపరీతమైన కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో మంచంపై నిద్రించాడు. ఎంతోసేపు అయినా లేవకపోవడంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. డాక్టర్ వచ్చి పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలిక ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): సెల్‌ఫోన్ కొనివ్వలేదని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. గ్రామానికి చెందిన స్వామి శ్యామల దంపతుల కూతురు శ్రీలత(18) డిగ్రీ చదువుకుంటుంది. తనకు సెల్‌ఫోన్ ఇప్పించాలని తల్లిదండ్రులను శ్రీలత కోరగా వారు కొనివ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రీలత ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరకున్న ఎస్‌ఐ పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..


ఎల్లం(ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అనంతసాగర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు కథనం మేరకు.. అనంతసాగర్ గ్రామానికి చెందిన ఎల్లం(25) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఎల్లం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. స్థానికులు వైద్యంకోసం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిలువెల్లా నిర్లక్ష్యం!

- బార్ అండ్ రెస్టారెంట్లలో నో ఫైర్ సేఫ్టీ
- తరచూ షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు


బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం (ఫైల్)

దుబ్బాకరూరల్: జిల్లాలోని బార్ అండ్ రెస్టారెంట్లు ఫైర్ సేఫ్టీ లేకుండా కొనసాగుతున్నాయి. ప్రతి రోజూ చాలా మంది బార్‌కు వెళ్లి మద్యం సేవిస్తుంటారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు బార్ అండ్ రెస్టారెంట్లు కొనసాగుతుటాయి. ఈ సమయంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణాలే కోల్పోవాల్సి వస్తుంది.

గ్యాస్ లీకై ప్రమాదాలు..

బార్ అండ్ రెస్టారెంట్‌లో వంట గది ఉంటుంది. తిరొక్క వంటకాలు చేసి కస్టమర్లకు అందిస్తారు. ఉదయం నుంచి మొదలుకొని రాత్రి 11 గంటల వరకు చేస్తూనే ఉంటారు. వంటలను గ్యాస్‌పైన లేక కట్టెల పొయ్యి మీద చేస్తుంటారు ఇలాంటి సమయంలో గ్యాస్ లీక్ అయ్యి అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అదే కట్టెల పొయ్యి మీద అయితే నిప్పురవ్వలు ఎగిసిపడి ప్రమాదం చోటు చేసుకుంది.

విద్యుదాఘాతంతో..

బార్ అండ్ రెస్టారెంట్‌లో పెద్ద పెద్ద ఫ్రిజ్‌లు ఉండడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉంటుంది. బార్‌లో ఎక్కువగా 30 మంది వరకు కార్మికులు పని చేస్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణాలే పోతాయి. పట్టణ ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్లు ఇళ్ల మధ్యలో ఉంటాయి. అగ్ని ప్రమాదాలు జరిగితే పరిసర ప్రాంతాల ప్రజలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది. ఇటీవల సిద్దిపేట పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. రాత్రి పూట జరగడం వల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు.

ఉన్నతాధికారులకు విన్నవిస్తాం

జిల్లాలో 16 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఏ ఒక్క బార్‌కు ఫైర్ సేఫ్టీ లేదు. ఫైర్ సేఫ్టీ కోసం ఉన్నతాధికారులకు విన్నవిస్తాం. ఒక వేళ అగ్ని ప్రమాదం జరిగితే ప్రమాదమే. ఇటీవల సిద్దిపేటలో బార్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. బార్ యజమానులు ఫైర్ సేఫ్టీ కోసం ఫైర్ అధికారులను సంప్రదించాలి.

– శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ జిల్లా అధికారి

ఫైర్ సామగ్రి బిగిస్తాం

బార్ అండ్ రెస్టారెంట్లలో ఫైర్ సేఫ్టీ కోసం మా దృష్టికి తీసుకొస్తే సామగ్రిని ఏర్పాటు చేస్తాం. నిత్యం ప్రజల్లో ఉండే ప్రదేశాల్లో ఫైర్ సేఫ్టీ అవసరం. ఫైర్ సేఫ్టీపై ప్రజలకు ప్రతి రోజూ అవగాహన కల్పిస్తున్నాం. ఫైర్ సామగ్రి కావల్సిన వారు మీ దగ్గరలోని ఫైర్ కార్యాలయంలో సంప్రదించాలి.

– వెంకన్న, జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్

నడుచుకుంటూ వెళ్తుండగా..

- వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

వట్‌పల్లి(అందోల్): రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం మేరకు.. అందోలు మండలం రాంసానిపల్లి శివారులోని జియో పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ క్రమంలో మృతదేహంపై సంగారెడ్డి వైపు వెళ్లే వాహనాలు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయ్యింది. కనీసం మొఖం కూడా గుర్తు తెలియకుండా అయ్యింది. మృతుడి వివరాలు తెలిసే పరిస్థితి కనిపించడంలేదని ఎస్‌ఐ తెలిపారు.